

ఉల్లి రైతు దైన్యం
మార్కెట్‌లో ఉల్లి అమ్ముకునేందుకు స్థలం లేకపోడంతో రోడ్లపైనే విక్రయించారు.
వివరాలు 8లో ▸



షబేఖదర్ వేడుకలు
జిల్లావ్యాప్తంగా షబేఖదర్ (లైలతుల్ ఖద్ర్)ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.1 /27.0
రోజంతా ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. ఆకాశం నిర్మానుష్యంగా ఉండి వడగాలులు వీచే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-39
(గురువారం సాయంత్రం)
సహర్ 4-36
(శుక్రవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

జిల్లా జడ్జి బదిలీ

గద్వాల క్రైం: గద్వాల జిల్లా జడ్జి కనకదుర్గ బదిలీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా మొదటి అదనపు జడ్జిగా బదిలీపై వెళ్లనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. గతేడాది జూన్ 2వ తేదీ నుంచి జిల్లా జడ్జిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



కేటీదొడ్డి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు, ఏటీఎం వివరాలు చెప్పవద్దని గద్వాల సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని నందిన్నెలో కమ్యూనిటీ కాంటాక్ట్ పోగ్రాంలో భాగంగా ఎస్పీ సృజన ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి వాహనాల ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సరిహద్దులో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేదుకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని, అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా అజాగ్రత్తంగా నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే మహిళలు, బాలికలు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అనంతరం బాల్యవివాహాలు, చైల్డ్‌లైన్, పోక్సో కేసులపై అవగాహన కల్పించారు. సరైనా పత్రాలు లేని 30 వానాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేష్, శేఖర్, కర్రె శేఖర్‌రెడ్డి, ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

గద్వాల అర్బన్: భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని నేరుగా కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను ఆశ్రయించొద్దని కార్మికశాఖ అధికారి మహేష్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో లేబర్ కార్డులపై కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. లేబర్ కార్డుల విషయంపై ఆరా తీశారు. కార్మికుల నుంచి వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. ఇదిలాఉండగా, గతనెల 3, 31వ తేదీల్లో 'సాక్షి'లో 'అవినీతి జలగలు, లేబర్ కార్డు ఫర్ సేల్' అనే శీర్షికలతో లేబర్ కార్డు, బీమా క్లెయిమ్స్ పేరిట జరుగుతున్న దోపిడీపై కథనాలు ప్రచురితమయ్యాయి. తాజా హెచ్చరికలతో అయినా వీటికి అడ్డుకట్ట పడుతుందా..? లేక యధావిధిగా కొనసాగుతుందా ? అనేది చూడాలి.

ఉపాధ్యాయులకు అండగా ఉంటా: ఎమ్మెల్సీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులకు అండగా ఉంటామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని నేషనల్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా తాను విద్యారంగంలో సేవలందిస్తున్నానని, ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరిగేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, సమస్యలను వారికి విన్నవిస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా గెలిపించిన ప్రతి ఉపాధ్యాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైందని, తమవంతు కష్టపడి ఆ వృత్తికి మరింత గౌరవం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్‌గౌడ్, సునీల్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వనపర్తిలో కుతకుత!

మంత్రి ఇలాకాలో నాటకీయ పరిణామాలు

- బీఆర్ఎస్ అసమ్మతులతో టచ్‌లోకి మాజీ మంత్రి జూపల్లి
- సింగిరెడ్డి ఓటమే లక్ష్యంగా ఏకతాటి పైకి..
- ఇదే క్రమంలో దూకుడు పెంచిన బీజేపీ
- భూకబ్జాల్లో నిరంజన్‌రెడ్డి హస్తం ఉందంటూ ప్రచారం
- పోటాపోటీ రాజకీయాలతో హీటెక్కిన జిల్లా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పోటాపోటీ రాజకీయాలతో వనపర్తి హీటెక్కింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాలు సర్వత్రా ఆసక్తి రేపుతున్నాయి. అధికార పార్టీ బీఆర్ఎస్‌ను వీడి మంత్రిపై పోరుబాట పట్టిన అసమ్మతి నేతలు.. ప్రతీకార పాలి'ట్రిక్స్' నడుపుతున్న తీరు హాట్ టాపిక్‌గా మారింది. వనపర్తిలో సింగిరెడ్డి ఓటమే లక్ష్యమని బహిరంగంగా ప్రకటించిన కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ బహిష్కృత నేత, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు అసమ్మతి నేతలతో టచ్‌లోకి రావడం కీలక మలుపునకు దారితీసినట్లు తెలుస్తోంది. ఎప్పుడు, ఏం జరుగుతోందని ఇప్పటికే ఈ సెగ్మెంట్‌పై నజర్ వేసిన బీజేపీ సైతం నిరంజన్‌రెడ్డికి వ్యతిరేకంగా దూకుడు పెంచడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

అప్పుడు తెర వెనుక.. ఇప్పుడు ప్రత్యక్షంగా..

సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జూపల్లికి.. మంత్రి నిరంజన్‌రెడ్డికి మధ్య వైరం మొదటి నుంచీ కొనసాగుతోంది. వీరి మధ్య తెర వెనుక మాత్రమే పోరు జరిగేది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డి వనపర్తి నుంచి, జూపల్లి కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. నిరంజన్‌రెడ్డి ఓటమి పాలు కాగా.. జూపల్లి గెలుపొంది మంత్రి అయ్యారు. తన ఓటమి వెనుక జూపల్లి హస్తం ఉందని భావించిన ఆయన దూరంగా ఉంటూ వచ్చారు. అయితే 2018 ఎన్నికల్లో కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత బీరం గులాబీ పార్టీలో చేరగా.. జూపల్లి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధిక్కార స్వరం వినిపించడంతో ఇటీవల ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. దీనికంతటికీ నిరంజన్‌రెడ్డినే కారణమని.. ఆయన ఓటమే లక్ష్యమంటూ కొల్లాపూర్ నియోజకవర్గంలోని తన అనుచరులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో జూపల్లి ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే అంతకు ముందు కొన్ని రోజుల క్రితమే వనపర్తి బీఆర్ఎస్‌లో అసమ్మతి భగ్గుమనగా.. జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. వీరితో జూపల్లి సంప్రదింపులు జరపడంతో రాజకీయ వర్గాల్లో చర్చ జోరందుకుంది. ఇన్నాళ్లు ఇద్దరి మధ్య తెరవెనుక సాగిన పోరు.. ప్రత్యక్షంగా మారడంతో ఇటు వనపర్తితో పాటు అటు కొల్లాపూర్‌లో రాజకీయాలు హాట్‌హాట్‌గా మారాయి.



రివేంజ్ పాలి'ట్రిక్స్'..

అధికార బీఆర్ఎస్‌లో అసమ్మతి సెగలు భగ్గుమనడంతో మంత్రికి ఇన్నాళ్లు సన్నిహితంగా ఉన్న మేఘారెడ్డి పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొన్నాళ్లు స్తబ్దుగా ఉండగా.. రెండు, మూడు రోజుల క్రితం మేఘారెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సబ్ కాంట్రాక్ట్ ఇప్పిస్తానని రూ.3.55కోట్లు మోసం చేసినట్లు మేఘారెడ్డిపై ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీని వెనుక మంత్రి హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే ఇదివరకే ఈ నియోజకవర్గంపై కన్నేసిన బీజేపీ అసమ్మతి నేతలతో సంప్రదింపులు జరుపుతోంది. మేఘారెడ్డిపై కేసు నమోదు కావడం.. ఆ తర్వాత రోజే బీజేపీకి చెందిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మంత్రి నిరంజన్‌రెడ్డి భూకబ్జాలకు పాల్పడ్డాడరంటూ ధ్వజమెత్తడం హాట్‌టాపిక్‌గా మారింది. ప్రతీకార పాలి'ట్రిక్స్'కు తెరలేపారనే చర్చ ఊపందుకుంది. మరోవైపు కాంగ్రెస్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర రెండో విడత వనపర్తి నియోజకవర్గంలో వచ్చే నెలలో కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ఈ యాత్రకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరుకానుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అదేవిధంగా 25న పాలమూరులో బీజేపీ నిరుద్యోగ మార్చ్ నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఈ క్రమంలో వనపర్తిలో మారుతున్న రాజకీయ పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయోననే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

10 వేల మందితో ఆత్మగౌరవ సమ్మేళనం..

సీనియర్ రాజకీయ నాయకుడిగా జూపల్లికి ఉమ్మడి పాలమూరుపై మంచి పట్టు ఉంది. వచ్చే ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. తమతో కలిసి వచ్చే నాయకులు, అధికార పార్టీలోని అసంతృప్త నేతలను కలుపుకుని కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వనపర్తిలో సింగిరెడ్డి ఓటమే లక్ష్యంగా ఎత్తుగడలు సిద్ధం చేసినట్లు సమాచారం. నియోజకవర్గంలో అసంతృప్త నేతలు, ముఖ్య నాయకులను ఏకతాటిపైకి తేవడంతో పాటు ఈ నెల 23న లేదంటే ఈ నెల చివరి వారంలో ఏదో ఒక రోజు పదివేల మందితో బహిరంగసభ నిర్వహించి సక్సెస్ చేసేందుకు సమాయత్తమైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఉమ్మడి పాలమూరులో పలు నియోజకవర్గాల్లో నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు సమాచారం.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి తరగతులను విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం తన చాంబర్‌లో వేసవి తరగతులకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏప్రిల్ 22వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కాలేజీ గట్టు నందు బాలబాలికలకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, ఏకలవ్య మోడల్ పాఠశాలలకు చెందిన 200 మందికి చిత్రలేఖనం, నాట్యం, సంగీతం, సైన్స్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంతీయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి, జిల్లా కోఆర్డినేటర్ రఘు, ప్రిన్సిపల్ సీహెచ్ వాణిలు పాల్గొన్నారు.

సదరం క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాలన్యూటౌన్: సదరం క్యాంపులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి ఉమాదేవీ తెలిపారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించనున్న సదరం క్యాంపుల ప్రణాళికను విడుదల చేశా రు. ఏప్రిల్ 25వ తేదీ, మే 2, 9, 16, 23, 30వ తేదీల్లో (మంగళవారం) కంటి, శారీరక, మాన సిక వికలత్వం ఉన్న దివ్యాంగులకు, ఏప్రిల్ 26వ తేదీ, మే 3, 10, 17, 24, 31వ తేదీల్లో (బుధవారం) శారీరక వికలత్వం ఉన్న దివ్యాంగులకు, ఏప్రిల్ 29వ తేదీ, మే 6, 20, 27వ తేదీల్లో చెవిటి, మూగ వికలత్వం ఉన్న దివ్యాంగులకు సదరం క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికలంగత్వ అర్హత, రెన్యూవల్ కోసం అవసరమైన దివ్యాంగులు సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంపునకు హాజరు కాదల్చిన దివ్యాంగులు ముందుగా మీ-సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

వేరుశనగ @ రూ.6,870

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 1,354 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.6,870, కనిష్టం రూ.3,429, సరాసరి రూ.5,600 ధరలు లభించాయి. 498 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5612, కనిష్టం రూ.4002, సరాసరి రూ.5320 ధర పలికింది. 17 క్వింటాళ్ల కందికి గరిష్టం రూ.7309, కనిష్టం రూ.3939, సరాసరి రూ.7012, 1419 క్వింటాళ్ల వరికిగాను గరిష్టంగా రూ.2189 ధర వచ్చింది.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

మానవపాడు: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని చూసి సహించలేక బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇకపై సహించేది లేదని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీడుభూములను వ్యవసాయభూములుగా మార్చిన ఘనత మంత్రి నిరంజన్‌రెడ్డిది అని, చందూరు గ్రామంలోని భూములు వారి కుటుంబ సభ్యులు కొన్న భూములేనని వివరించారు. అందులో ఆర్డీఎస్ భూములు లేవని, కబ్జాలు చేసే ప్రభుత్వం బీఆర్ఎస్ కాదన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనపడకపోతే కంటిపరీక్షలను చేయించుకోవాలని, నిరాధారణమైన ఆరోపణలు మాని ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి, పీఏసీఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మురళీదర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి



నర్సింగ్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: జిల్లాలో ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, వీటిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాతనే నడ్డగడ్డకు న్యాయం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నూతన భవనంలో కళాశాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాబోవు రోజుల్లో గద్వాల వైద్య పరంగా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే క్రమశిక్షణ అవసరమన్నారు. ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాన్ని సాధించేందుకు నిరంతరం చదువుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ కమల, కౌన్సిలర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఎదుట రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

మెరుగైన పాలన కోసమే మండలం ఏర్పాటు



బీచుపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం, నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజలకు మెరుగైన పాలనను అందించడం కోసమే ప్రభుత్వం నూతన మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం ఎర్రవల్లిని నూతన మండలంగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేయడంతో బుధవారం బీచుపల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి, అఖిలపక్షం ఆధ్వర్యంలో బీచుపల్లి నుంచి ఎర్రవల్లి చౌరస్తా వరకు చేపట్టిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎర్రవల్లి కూడలిలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్వర పాలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నూతన మండలంగా ఎర్రవల్లిని ఏర్పాటు చేసినందుకుగాను ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, మహేశ్వరెడ్డి, కృష్ణసాగర్, ఈదన్న, గిడ్డారెడ్డి, శ్రీను, మదునాయుడు, గుమ్మాగోవర్ధన్, రాఘన్న, సుదాకరెడ్డి, లక్ష్మన్న, బజారి, కృష్ణ, రాముడు, లోకారెడ్డి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో మేలు

- జాతీయ సెమినార్‌లో పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానం-2020తో విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతో మేలు చేకూరుతుందని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో నూతన విద్యావిధానంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యారంగంలో కూడా మార్పులు రావడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. కొత్త విద్యావిధానంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై ఎక్కువ దృష్టి సారించి, మంచి అవకాశాలు వచ్చేందుకు ఆస్కారం ఉందన్నారు. చదువుతో పాటు పలు కొత్త అంశాలను ఇందులో చేర్చడం వల్ల విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ అధ్యాపకులు శివారెడ్డి, ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

32మంది ఎంపిక

పాలమూరు యూనివర్సిటీలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 32 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన వారిని వీసీ అభినందించారు.

సూత్రధారులెవరు..?

- రూ.17లక్షల సీపీఎస్ నిధులు కాజేసిన ప్రభుత్వ ఉద్యోగి
- గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తుల ఖాతాల్లోకి బదిలీ..
- బాధితుల ఫిర్యాదుతో కదిలిన డొంక
- నీటిపారుదల శాఖలోని అవినీతి జలగకు సహకరించిందెవరు?
- కూపీ లాగుతున్న పోలీసులు

గద్వాల క్రైం: ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 18మంది ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన సీపీఎస్ (కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం) నిధులు రూ.17లక్షలు కాజేశాడో ప్రభుత్వ ఉద్యోగి. నెలల తరబడి ఎదురుచూసిన బాధితులకు ఎంతకూ ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ డొంక కదిలింది. నిధులు కాజేసిన ఉద్యోగి వెనక ఉన్న అసలు సూత్రధారులెవరు, ఆయనకు సహకరించిందెవరు అనే దానిపై కూపీ లాగే పనిలో ఉన్నారు పోలీసులు.

ఏం జరిగిందంటే..

జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ(ఇరిగేషన్)లో పనిచేసే 18మంది ఉద్యోగులు సీపీఎస్ నిధులు డ్రా చేసుకునేందుకు 2021 - 2022 మధ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అదే శాఖలోని విభాగం -4లో ఎండీ జహంగీర్ టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్నాడు. సదరు ఉద్యోగులు తమ వ్యక్తిగత సమాచారాన్ని తరచూ టైపిస్టుకు తెలియజేయడం, సీసీఎస్ పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలు అతని వద్ద ఉండడంతో మొత్తం 18 మంది ఉద్యోగులకు సంబంధించిన రూ.16,83,130 లక్షలను గుట్టుగా కాజేశాడు. ఈ డబ్బును మరో ఆరు ఖాతాల్లోకి మళ్లించాడు. ఎన్ని రోజులైనా సీపీఎస్ నిధులు ఖాతాలో జమ కాకపోవడంపై ఏం జరిగిందనే అంతరమథనంలో బాధితులు పడ్డారు. చివరకు తమ వ్యక్తిగత సమాచారం, సీసీఎస్ పాస్‌వర్డ్ టైపిస్టుకు మాత్రమే తెలుసని, అతనిపై అనుమానంతో ఈ నెల 12వ తేదీన అదే శాఖకు చెందిన పే అండ్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ వెంటనే టైపిస్ట్‌పై చీటింగ్ తోపాటు 420, 406 ఐపిసి సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.

పక్కా ప్రణాళికతో మళ్లింపు

కాజేసిన సీపీఎస్ నిధులను టైపిస్ పక్కా ప్రణాళికతోనే ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించాడు. అయితే ఆ ఖాతాలు ఎవరివి అనేది తెలియాల్సి ఉంది. ఒక్కో ఖాతాలో ఎప్పటి నుంచి సీపీఎస్ నిధులు మళ్లించారు, అసలు ఈ ఖాతాల్లోని వ్యక్తులు ఎవరు.. కేవలం ఈ నిధులు మళ్లించారా, అంతకుముందు ప్రభుత్వ బిల్లులు, కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులు సైతం దారి మళ్లించారా..? అనే అనుమానాలపై సైతం పోలీసులు కూపీ లాగుతున్నారు. దీంతోపాటుప్రధాన కార్యాలయ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ టైపిస్ట్‌కు ఎలా తెలుసు, అక్కడి సిబ్బంది సైతం ఈ నిధులు కాజేసేందుకు వ్యూహం రచించారా, ఇంటి దొంగలెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరో వైపు పోలీసులు ఇప్పటి వరకు జహంగీర్‌ను అదుపులోకి తీసుకున్న విషయంపై స్పష్టత లేదు. కాగా.. విచారణలో ఎంత మంది సీపీఎస్ నిధులు కాజేసేందుకు చేతులు కలిపారంటూ ఆ శాఖ సిబ్బంది చర్చించుకుంటున్నారు.



గద్వాల ఇరిగేషన్ శాఖ- 4 విభాగం కార్యాలయం

ఇంటి దొంగలు ఎంతమంది?

నిధుల కాజేత వ్యవహారంలో టైపిస్టుతోపాటు మరి కొందరు చేతులు కలిపినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నీటిపారుదల శాఖలోని పే అండ్ అకౌంట్ ఆఫీసర్ గతంలో కొన్ని నెలలపాటు సెలవుపై వెళ్లగా.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారని తెలిసింది. ఆ సమయంలోనే ఈ వ్యవహారానికి పథకం రచించాడా, లేక పాస్‌వర్డ్ తస్కరించాడా, ఇంకెవరిదైనా ప్రోత్సాహం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగదు మళ్లించిన ఆ ఆరుగురు అకౌంట్‌దారులు ఎవరు, మిగతా అన్ని చిక్కుముడులు పోలీసుల విచారణలో వీడనున్నాయి.

త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం

గద్వాల ఇరిగేషన్‌శాఖలో సీపీఎస్ నిధులు కాజేసిన సంఘటనపై విచారిస్తున్నాం. ఇందులో ఎంతమంది పాత్ర ఉంది, వారికి సహకరించింది ఎవరు అనేది విచారణలో తేలనుంది. ఎవరినీ ఉపేక్షించం. దోషులపై చర్యలు తీసుకుంటాం. త్వరలో టైపిస్ట్ జహంగీర్‌ను అరెస్టు చేస్తాం.
– అబ్దుల్‌షుకూర్, పట్టణ ఎస్‌ఐ, గద్వాల

క్లుప్తంగా

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



గిర్ని నర్సింహ (ఫైల్)

తెలకపల్లి: చెట్టు పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని గట్టునెల్లికుదురుకు చెందిన గిర్ని నర్సింహ (58) చింతచెట్టు కౌలుకు తీసుకున్నాడు. మంగళవారం సాయంత్రం చెట్టుకు ఉన్న పండు తెంచడానికి ఎక్కగా కొమ్మ విరిగి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నర్సింహకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ కిందపడి చిన్నారి దుర్మరణం

గట్టు: ట్రాక్టర్ కిందపడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్‌జీ కథనం మేరకు.. గ్రామానికి చెందిన జయమ్మ, పరశురాముడు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. జయమ్మ ఇంటి ముందు రోడ్డు పక్కనే ఉన్న కిరాణ దుకాణానికి వెళ్లింది. చిన్న కుమార్తె అమ్ములు(5) తల్లి దగ్గరకు పరుగెడుతుండగా.. అదే సమయంలో సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. కళ్ల ముందే చిన్నారి మృతిచెందటంతో తల్లి రోదనలు మిన్నంటాయి. ఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

బాలానగర్: మండలంలోని ఉడిత్యాలకు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా.. ఉడిత్యాలకు చెందిన గుడ్ల నర్సింహులు (46) మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో గుండేడ్ రోడ్డు మార్గాన బైక్‌పై వస్తున్నాడు. ఉడిత్యాల సమీపంలో తలకు తీవ్రగాయాలై రోడ్డు పక్కన పడి ఉండడంతో, గ్రామస్తులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికేగా మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా తిర్మలాపూర్ చెందిన కొరవాని శ్రీనివాసులు(33) మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తాను పనిచేస్తున్న కంపెనీ వద్ద పురుగుల మందు తాగి పడిపోయారు. గమనించిన స్థానిక చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి అతని భార్య అర్చనకు సమాచారం అందించారు. అదే రోజు సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తమ గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్తతో తరుచూ ఫోన్‌లో మాట్లాడుతుండేదని, ఈకారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్క దాడి: బాలుడికి తీవ్ర గాయాలు



అచ్చంపేట రూరల్: ఓ బాలుడిపై ఊర కుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ సంఘటన అచ్చంపేట మండలం బొల్లగట్‌పల్లిలో బుధవారం జరిగింది. ఆ వివరాలు... బల్మూర్ మండలం లక్ష్మీపల్లికి చెందిన కుమార్, దేవి దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు గుండాల అఖిల్(5) అమ్మమ్మ ఊరైన బొల్లగట్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వచ్చాడు. మధ్యాహ్నం ఇంటి ముందున్న కుళాయి వద్ద ఆడుకుంటుండగా పక్కనే ఉన్న ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. కిందపడిన బాలుడి తలను తీవ్రంగా కరిచింది. దీంతో తలపై ఉన్న చర్మం ఊడింది. బాలుడి కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి కుక్కను తరిమారు. అప్పటికే బాలుడికి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలకు 25కుట్లు వేశారని, పరిస్థితి విషమంగానే ఉందని అక్కడి వైద్యులు తెలిపారు. కాగా బాలుడి తండ్రి కుమార్ ఇటీవలే మరణించాడు.

ఐదుగురికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ప్లాట్ విషయంలో జరిగిన గొడవలో ఐదుగురికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. టంకరలో ఓ ప్లాట్ విషయంలో ఎస్.వెంకటయ్యతో అయిదుగురు వ్యక్తులు గొడవపడగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు 2016లో హన్వాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం మహబూబ్‌నగర్ కోర్టులో కేసు విచారణ చేపట్టిన న్యాయమూర్తి కె.శిరీష సాక్షులను విచారించి ఏ-1 పాండు, ఏ-2 నారాయణ, ఏ-3 మల్లయ్య, ఏ-4 రాజు, ఏ-5 వినోద్‌కు ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున రూ.32,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు దర్యాప్తునకు కృషిచేసిన ఎస్‌ఐ జగదీశ్వర్, ఏపీపీ మెనూశ్రీ, కానిస్టేబుల్ కృష్ణయ్యను ఎస్పీ కె.నరసింహ అభినందించారు.

ఉల్లి రైతు దైన్యం



దేవరకద్ర మార్కెట్ రోడ్‌లో ట్రాక్టర్‌పై ఉల్లి బస్తాలు పెట్టుకుని అమ్ముకుంటున్న పల్లెగడ్డ రైతు

- మార్కెట్‌లో కొనేవారు లేక రోడ్లపై విక్రయాలు
- 45 కిలోల బస్తా రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయం

దేవరకద్ర: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉల్లి రైతుకు ఆ కష్టాలు రెట్టింపయ్యాయి. ఒక పక్క ధరలు లేక డీలాపడిన రైతుకు కనీసం విక్రయించడానికి కూడా వీలులేని పరిస్థితిలో రోడ్లపై ఉల్లిబస్తాలు పెట్టుకుని అమ్ముకునే పరిస్థితి వచ్చింది. దేవరకద్ర మార్కెట్ బయట ఉల్లి రైతులు దీనస్థితిలో సొంతంగా విక్రయాలు చేస్తూ కనిపించారు.



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులు

మార్కెట్‌లో స్థలం లేక..

యాసంగి సీజన్ కింద దిగుబడిగా వచ్చిన ఉల్లి పెద్ద మొత్తంలో రావడంతో మార్కెట్‌లో ధరలు పూర్తిగా పడిపోయాయి. ఈ స్థితిలో యాసింగి సీజన్ కింద దిగుబడిగా వచ్చిన వరి ధాన్యం మార్కెట్‌కు అమ్మకానికి రావడంతో స్థలంలేక ఉల్లి రైతులు నానా ఇబ్బందుల పాలయ్యారు. మార్కెట్ ఆవరణ అంతా ధాన్యం కుప్పలతో నిండిపోవడంతో కొందరు రైతులు అక్కడక్కడ ఖాళీ స్థలం ఉంటే ఉల్లిని కుప్పలుగా పోశారు. చాలామంది రైతులు ఉల్లి బస్తాలను ట్రాక్టర్లపై తెచ్చి నేరుగా విక్రయాలు ప్రారంభించారు. ఇక మార్కెట్‌లో ఉల్లిని వేలం వేసే పరిస్థితి లేక, వ్యాపారులు ధరలు నిర్ణయించి ఉల్లిని కొనుగోలు చేశారు. క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.800, కనిష్టంగా రూ.600 వరకు విక్రయాలు జరిగాయి. వ్యాపారుల విక్రయాలతో పాటు మార్కెట్‌లో కూడా కొందరు రైతులు నేరుగా ఉల్లి బస్తాలను సొంతంగా అమ్ముకున్నారు.

45 కేజీల బస్తాలతో..

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి విక్రయాలు కొనసాగగా 45 కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.400, కనిష్టంగా రూ.300 వరకు విక్రయించారు. బయట రైతులు కూడా ఇవే ధరలకు ఉల్లిని విక్రయించారు. మొత్తం మీద మండుతున్న ఎండలకు రోడ్లు పొగలు సెగలతో అట్టుడికి పోతుండగా, రోడ్ల పక్కన నిలబడి ఉల్లిని అమ్ముకున్న రైతుల పరిస్థితి కనిపించింది. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యంగా ఉండడంతో బాగా ఆరబెట్టింది కావడంతో చాలా మంది వినియోగదారులు ఉల్లిని బస్తాలుగా కొన్నారు. చాలాకాలం నిల్వ చేసుకోడానికి అవకాశం ఉండడం వల్ల వినియోగదారుల వ్యాపారం జోరుగా సాగింది.

నిషేధిత మత్తు పదార్థాలు స్వాధీనం

కర్నూల్ పోలీసులకు నిందితుడి అప్పగింత



కర్నూల్ పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడి కారును గుర్తించిన పోలీసులు

ఎర్రవల్లిచౌరస్తా/గద్వాల క్రైం: నిషేధిత మత్తు పదార్థాలతో ఏపీలోని విశాఖపట్నం చెందిన ఓ వ్యక్తి బుధవారం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు కారులో తీసుకెళ్తున్నట్లు కర్నూల్ జిల్లా పోలీసులకు సమాచారం రావడంతో జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులకు విషయం చేరవేశారు. ఉదయం నుంచి జాతీయ రహదారిపై కొండాపురం పోలీసులు, కర్నూల్ పోలీసులు విస్తృతంగా ఎర్రవల్లి చౌరస్తాలో వాహనల తనిఖీ చేపట్టారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో ప్రయాణికుల కారులో గుర్తించారు. వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి 90 మత్తు కలిగించే మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.2లక్షకు పైగా ఉంటుందని కర్నూల్ పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కర్నూల్‌కు తరలించారు.

కొకైన్‌గా పుకార్లు..

నిషేధిత మత్తు పదార్థాలు తరలిస్తున్నట్లు రెండు రాష్ట్రాల పోలీసుశాఖ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. అయితే కొకైన్ బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు పెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు పుకార్లు వచ్చాయి. నిందితుడు సైతం పలు వాహనాలు మారుతూ ప్రయాణం చేయడం పెద్ద మొత్తంలో కొకైన్ మరో గుర్తు తెలియని వాహనంలో తరలిస్తూ ఆ కారును తప్పించే ప్రయత్నంలో భాగంగా ఈ వ్యూహంకు తెరతీసినట్లు వార్తలు వినిపించాయి. మత్తు కలిగించే పదార్థాలు హైదరాబాద్, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అయితే హైదరాబాద్‌లోని పలు సినీ ప్రముఖులు, నాయకులకు, యువతకు మాదకద్రవ్యాలు సరఫరా చేసే ముఠా ఉన్నట్లు పోలీ సులు అనుమానిస్తున్నారు. ఈ విషయంపై గద్వాల డీఎస్పీ రంగస్వామిని వివరణ కోరగా.. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు నిషేధిత మత్తు పదార్థాలు తరలిస్తున్నట్లు కర్నూల్ పోలీసులు సమాచారం ఇచ్చారు. అక్కడి పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసుశాఖ వారు సహకరించారు. పూర్తి వివరాలు కర్నూల్ పోలీసుశాఖకు తెలుసని సమాధానం ఇచ్చారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కన్వీనర్ దాసరి నాగయ్య

మన్ననూర్: నల్లమలలో యురేనియం తవ్వకాల కోసం ఉవ్విళ్లూరుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆలోచనా విధానాలను తిప్పి కొట్టేందుకు ఉమ్మడి అమ్రాబాద్ మండల ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ దాసరి నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం అటవీశాఖ వనమాళికా ప్రాంగణంలో కమిటీ నాయకులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ నల్లమలలో తవ్వకాలు చేసి యురేనియంను భూమి లోపల నుంచి వెలికి తీస్తామన్న మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 2008లో అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం 123 న్యూక్లియర్ అనుఒప్పందంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారం చేతిలో ఉందికదా అని రంగులు మార్చే ఊసరవెల్లి లాగా యురేనియం వెలికి తీస్తామంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఈ చర్య జరిగితే ప్రకృతి రమణీయమైన నల్లమల ప్రాంతంలో దశాబ్దాలకాలంగా జీవిస్తున్న ప్రజలు, పులుల రక్షిత అభయారణ్యం, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తాగునీరు, సాగునీరు అందించే కృష్ణానది కలుషితం అవుతాయనేది గమనించాలని అన్నారు. ప్రపంచ దేశాలు సైతం యురేనియం వెలికితీయడాన్ని వ్యతిరేకిస్తున్న క్రమంలో ప్రశాంతంగా ఉన్న ఈ నల్లమల ప్రాంతంలో అల్లకల్లోలం సృష్టించాలని కుట్రకు పూనుకుంటున్న బీజేపీ అనాలోచిత విధానాలను ఉద్యమాల ద్వారా తిప్పికొడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ లక్ష్మీనారాయణ, బాలయ్య, అంబయ్య, అనిల్‌కుమార్, పర్వతాలు, వెంకటేష్, రామస్వామి, తిరుపతయ్య పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా షబేఖదర్ వేడుకలు



మహబూబ్‌నగర్‌లో జామియ మజీద్‌లో షబేఖదర్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు వ్యాప్తంగా ముస్లింలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు పవిత్ర రంజాన్ షబేఖదర్ (లైలతుల్ ఖద్ర్)ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.' షబే ఖద్ర్ అంటే అతి విలువైనది, గౌరవమైనదని' అర్థం. వెయ్యి సాధారణ రాత్రుల కంటే ప్రధానమైందని ఖురాన్‌లో ప్రవచించినందున ముస్లింలు ఈ రాత్రుల్లో జాగరణ చేసి క్షమాభిక్షను కోరుతూ ఇంటిల్లిపాదీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షబేఖదర్ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండలాల్లోని మసీదులను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఆయా మసీదుల్లో హాఫిజ్‌లు తరావీ నమాజుల్లో ఖురాన్‌ను పఠించారు. ఈ సందర్భంగా హాఫిజ్‌లను ఘనంగా సత్కరించారు. మసీదుల్లో మతపెద్దలను పిలిపించి ధార్మిక సందేశం ఇప్పించారు. పవిత్ర రంజాన్ మాసంలోనే ఖురాన్ అవతరించిందని, ఈ మాసంలో జకాత్, ఫిత్రాలను విధిగా అందజేయాలని పిలుపునిచ్చారు. అల్లా చివరి దూత మహ్మద్ ప్రవక్త(స.అస) చూపిన మార్గంలో పయనించాలని, సున్నత్‌లను విధిగా అమలు చేయాలని సూచించారు. లైలతుల్ ఖద్ర్ సందర్భంగా ముస్లింలు తెల్లవారుజామున వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తహజ్జుద్ నమాజ్ చేసి ప్రత్యేక దువా చేశారు. తమ పాపాలను క్షమించాలని, మంచి నడవడిక ప్రసాదించాలని అల్లాను వేడుకున్నారు. జిల్లాకేంద్రంలోని జామీయ మజీద్‌లో మంగళవారం రాత్రి షబేఖదర్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేలాది సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

➩ షబే ఖదర్‌ను పురస్కరించుకొని కొన్ని మజీదుల్లో సహెరీ ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున వరకు షబేఖదర్ వేడుకల్లో ఆయా మజీదుల నిర్వాహకులు పాల్గొన్న ముస్లింలకు మజీద్ కమిటీల ఆధ్వర్యంలో సహెరీ భోజనం సౌకర్యం కల్పించారు.

160 కిలోల బెల్లం పట్టివేత



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్

లింగాల: మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ నుంచి ట్రాన్స్‌పోర్టు వాహనంలో 160 కిలోల బెల్లాన్ని తీసుకొస్తుండగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో వ్యాపారులతో ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ సమావేశమయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్లాన్ని విక్రయిస్తున్నారని.. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా మార్పు రావడం లేదని తెలిపారు. ఇంటి అవసరాలకు మాత్రమే బెల్లం విక్రయించాలని సూచించినా పట్టించుకోవడం లేదని, సారా తయారీదారులకు బెల్లంతో పాటు ఇతర రసాయనాలు విక్రయిస్తున్నట్లు తెలిసిందని వివరించారు. అధికారుల సూచనల మేరకు విక్రయాలు జరపాలని.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సర్పంచ్ కోనేటి తిరుపతయ్య హెచ్చరించారు. బెల్లాన్ని తీసుకొచ్చిన వారిపై కేసునమోదు చేయకపోవడం కొసమెరుపు.

7 టిప్పర్లు పట్టివేత



మిడ్జిల్: రిజర్వాయర్ పేరిట మండలంలోని కంచన్‌పల్లి ఊర చెరువు నుంచి బుధవారం అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్న 7 టిప్పర్లను తహసీల్దార్ రాజీవ్ రెడ్డి ఆదేశానుసారంగా ఆర్ఐ రామాంజనేయులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రిజర్వాయర్ పేరిట నల్లమట్టిని ఇటుక బట్టీలకు కూడా తరలిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెడలో నుంచి గొలుసు అపహరణ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కండె చంద్రకళ సాయంత్రం ఆలయంలో పూజలు చేసి ఇంటికి తిరిగి బయలుదేరింది. ఇంటి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసును లాక్కుని వెళ్లారు. పెనుగులాటలో మహిళ కింద పడింది. ముఖభాగం, దంతాలకు గాయాలయ్యాయి. మహిళను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ అనుదీప్, ఎస్‌ఐ గోవర్ధన్ సంఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు.

చెక్ డ్యాంలతో వాగులు సజీవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: చెక్ డ్యాంలో నిర్మాణంతో వాగులు సజీవంగా నీటితో కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని పెద్దవాగు, ఊకచెట్టువాగు, కందూర్ వాగులపై ఇప్పటికే 21 చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. వీటి వల్ల సత్ఫలితాలు వచ్చాయని సాగునీటి అవసరాలకు, భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడుతున్నాయని వివరించారు. నియోజకవర్గానికి రూ.77.69 కోట్లతో 9 చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టడానికి ఇరిగేషన్‌శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. వీటితో కలిపి మొత్తం 30 చెక్ డ్యామ్‌లు రూ.200కోట్లకు పైగా నిధులు విడుదల చేశారని చెప్పారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఎక్కడ నీటి వనరులు ఉంటే వాటిని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

9 చెక్ డ్యామ్‌లు నిర్మించే గ్రామాలు

నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం రాచాల వద్ద రూ. 6.67 కోట్లు, శాఖపూర్ వద్ద రూ. 4.79 కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భూత్పూర్ మండలం పోతులమడుగు వద్ద రూ.2.54 కోట్లు, పాత మొల్గర వద్ద రూ.2.26 కోట్లు, రావులపల్లి వద్ద రూ.3.8 కోట్లు చెక్ డ్యాంలకు మంజూరు కాగా, చిన్నచింతకుంట మండలం నెల్లికొండి వద్ద రూ. 15.29 కోట్లు, వడ్డెమాన్ దగ్గర రూ. 12 కోట్లు, తిర్మాలాపూర్ వద్ద రూ. 20.96 కోట్లు నిధులు కేటాయించారని తెలిపారు. దేవరకద్ర మండలం పెద్ద గోప్లాపూర్ వద్ద రూ. 10.6 కోట్లతో చెక్ డ్యామ్ మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, బాలస్వామి, ఆంజనేయులు, రాధాకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

టూరిస్టు సఫారీ నిలిపివేయాలి



ఎఫ్‌డీఓ కార్యాలయం వద్ద మల్లాపూర్ చెంచులు

మన్ననూర్: నల్లమల అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టూరిస్టు సఫారీని నిలిపివేయాలని అటవీశాఖ అధికారులకు చెంచులు మొరపెట్టుకుంటున్నారు. బుధవారం మల్లాపూర్‌కు చెందిన చెంచులు మన్ననూర్‌లోని ఎఫ్‌డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సఫారీతో చెంచుల జీవన భృతి కోల్పోతుండటంతో పాటు మానసిక, వ్యక్తిగత విలువలకు తీవ్రమైన భంగం కలుగుతుందని అన్నారు. టూరిస్టులకు మమ్మల్ని వింత జీవులుగా పరిచయం చేయడం బాధ కలిగిస్తోందని అన్నారు. అడవుల్లో సంచరిస్తున్న క్రమంలో టూరిస్టులను చూసి చెంచులు ఆందోళ చెందుతున్నారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా వాహనాల రాకపోకలతో వాతావరణం కూడా కలుషితం అవుతుందని, దారులవెంట దుమ్ము దూళితో చెంచులు తీవ్ర అనారోగ్యం పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు చెంచులను అడవి నుంచి దూరం చేసే కుట్రలో భాగంగా ఇలా చేస్తున్నారని వాపోయారు.

ప్రపంచ మానవ హక్కుల సమితి రాష్ట్ర చైర్మన్‌గా గణేష్



గణేష్‌ను అభినందిస్తున్న సభ్యులు

అచ్చంపేట: బల్మూర్ మండలం పొలిశెట్టిపల్లితండాకు చెందిన సామాజిక కార్యకర్త అంబోతు గణేష్‌నాయక్ ప్రపంచ మానవ హక్కుల సమితి రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా బ్యాంకాక్‌లోని థాయిలాండ్ సిటీలో బుధవారం ఎంపిక చేశారు. పదేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, చేస్తున్న సేవలను గుర్తించి సమితి సలహా మండలి తీసుకున్నట్లు చెప్పారు. బాధ్యత అప్పగించిన జాతీయ చైర్మన్ రావూరి బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తామన్నారు.

బాలికపై అఘాయిత్యానికి యత్నం

- బాలిక చిన్నమ్మతో సహా ముగ్గురిపై పోక్సో కేసు నమోదు
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘటన

సాక్షి, నాగర్‌కర్నూల్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారనే అక్కసుతో తన సొంత అక్క కూతురుపై అఘాయిత్యానికి ప్రయత్నించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని ఎర్రగడ్డకు చెందిన మహిళ కొన్నేళ్లుగా భర్తతో దూరంగా ఉంటోంది. వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోగా ఆమె అక్క మందలించింది. దీంతో సొంత అక్కపై కోపం పెంచుకుంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో బాత్‌రూం కోసమని బయటకు వచ్చిన ఆమె అక్క కూతురు, దివ్యాంగురాలైన మైనర్ బాలిక(15)ను తనతో రమ్మని పిలిచింది. సమీపంలోని పురాతన భవనంలోకి తీసుకెళ్లింది. ఆమె ప్రియుడు, మరో వ్యక్తితో కలసి బాలిక కాళ్లు, చేతులు కట్టేశారు. కాసేపటి తర్వాత వారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటి వైపు పరుగులు తీసింది. బాలిక తల్లి ఫిర్యాదుతో సదరు మహిళతో పాటు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులపై పోక్సో, నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఫార్మా కంపెనీ వద్దని ఆందోళన



నిరసన తెలుపుతున్న దేశాయిపల్లి గ్రామస్తులు

మహమ్మదాబాద్: ప్రమాదకర ఫార్మా కంపెనీ వద్దని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. బుధవారం మండలంలోని దేశాయిపల్లి గ్రామస్తులంతా తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నంచర్లగేట్ (దేశాయిపల్లి) శివారులో మినీ ఇండస్ట్రీ ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా కలర్ల తయారీ కంపెనీ చాటున ఫార్మా కంపెనీ నడిపిస్తున్నారని తెలిపారు. ఈ కంపెనీ నుంచి వదలిన వ్యర్థపు నీరు పొలాల్లోకి వెళితే పంటల, పశవుల పరిస్థితి ఏమిటని వారు అధికారులను ప్రశ్నించారు. మినీ ఇండస్ట్రీలో రెడ్ జోన్ లేదని, వారు ఫార్మా కంపెనీ పెట్టి రెడ్‌జోన్‌గా సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. విషయాన్ని ఇంతకు ముందే కలెక్టర్, ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని అన్నారు. సర్పంచ్ రఘు, అంజి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయాలంటూ నోటీసులు

ఆందోళన చేపట్టిన 80 కుటుంబాలు

మహమ్మదాబాద్: ఇళ్లు నిర్మించుకుని అరవై ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. కానీ దాదాపు 200కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలోని ఇళ్లన్నీ తమ పట్టాపొలంలోనే ఉన్నాయంటూ కొందరు నోటీసులు ఇచ్చారు. ధరణిలోనూ పట్టాదారుల పేర్లు ఉండటంతో రైతుబంధు కూడా తీసుకుంటున్నామని, వెంటనే ఖాళీ చేయాలని పేర్కొన్నారు. ఈ నోటీసులు అందుకున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం మొకర్లాబాద్ పంచాయతీ వద్ద నిరసన చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ ఇళ్లపై హక్కులను కల్పించాలని కోరారు. మండల పరిధిలోని మొకర్లాబాద్ గ్రామానికి చెందిన సార చిన్న వెంకటయ్య, పెద్దవెంకటయ్య, బాలయ్య కుటుంబాలకు చెందిన 128 సర్వే నంబర్‌లో సుమారు 12ఎకరాల భూమి ఉన్నది. అలాంటి భూమిని గత 70 సంవత్సరాల నుంచి అమ్ముకుంటూ వస్తున్నారు. వాటిని కొని ఇళ్లు నిర్మించుకున్నారు కొందరు. రెండు తరాలుగా అక్కడే నివసిస్తున్నారు.



